# కూతఘనం

'అమ్మా'

అమ్మా...

'మాట్లాడవేం?' – వినపడటంలేదూ – నాన్న... నిన్నూ... పిలుస్తున్నాడు.

'ఎందుకూ'?

ఏమో

కనుక్కురా, పోయి – ఏంపనో? మేడమెట్లు ఎక్కా–దిగా... నేను రాలేనమ్మ –

మరి – పిలుస్తూంటేనే.

పిలవనీ – నీవు అంతకన్నానూ – నీకూ, మీనాన్నకూ ఏమి పనిలేకపోతేసరి.

రావూ?

... ...

రానన్నదని చెప్పనా? – వెళుతున్నా – వెళ్ళి చెప్పేస్తాను – తరువాత నీ ఇష్టం.

ఇదిగో.

ఓయ్

నిన్నే –

'నిన్నే పిలుస్తున్నది... ఒకమారు ఇలారా.'

ఎందుకూ? చెపుతాను – రా – మెట్లమీదికి – చెప్పండి – ముందు

రావా –

ఊహూఁ

సరేలే –

పోనీలెండి – చెప్పకపోతే...

## 2

'ఎక్కడికి?'

'పలకరేం – మిమ్మల్నే – ఇంత ప్రొద్దుపోయి ఎక్కడికి?'

'ఈ చలిలో – నిద్ర మేలుకుని – మీతో మాట్లాడటానికి ఎవరు కనిపెట్టుకుని కూర్చున్నారు బాబూ?'

వెళ్ళద్దు –

'వెళితే – నేను ఒప్పుకోను – రోజూ ఇదే పాటయిపోయింది –'

వల్లకాదు – కదలడానికి వీలులేదు –

ఆకులు చీల్చి ఇవ్వనా - పోనీ, కిళ్లీ కడతాను - వేసుకోరూ?

తిరిగి తిరిగి నిశిరాత్రి ఇల్లు చేరుకోవడం మహాబాగున్నదండీ - పాలు చల్లారపోయినా?

ఒంటరిగా - నాకు భయం వేస్తుంది - కలలు వస్తాయి - అమ్మాయి కలువరిస్తుంది -

చూడండి - వెన్నెల కిటికిలోనుంచి - పక్కమీద పడుతూంది.

జాజిపొద - మరీ విరబూసింది కామోలు - గదంతా వాసన కమ్ముకుంటూన్నది.

ఇదిగో ఉత్తరీయం - నేనియ్యను.

ఉహు - తువ్వాల వేసుకోవడం - ఏమంత వచ్చింది - ఇదిగో - తీసుకోండి - పలికితేనే నోటి ముత్యాలన్నీ ఒలికిపోతాయా ఏమిటి - పోనీలెండి - ఇక ఎప్పుడన్నా ఉండమంటే - చెడ్డ ఒట్టు.

వెళ్ళండీ.

## 3

నాన్నా - మరే - నాన్నా - మేం, పెద్దసావట్లో నాటకం వేస్తున్నాం - చూడటానికి రావూ?

ఎవరు?

నేనూ - వాళ్ళ పాపాను, వస్తావా?

ఏం, నాటకం?

ఏం నాటకమేమిటి - నాటకం - ఏం అంటూ ఉంటుందా ఏమిటి - నాటకమంటే సరే.

రా - దబ్బున -

'మీ - అమ్మకూడా వస్తుందా' -

ఆ - ఇందాకనే వచ్చికూర్చుందే - నీవు రావడంతోనే ఆడేస్తాము.

. . . . . . . . .

'ఏమిటి - యీ నాటకం - నువ్వు ఆడిస్తున్నదేనా?'

'ఆc... అన్ని వేషాలూ మీ దగ్గిరే ఉన్నాయి'... పోలిక ఎక్కడికిపోతుంది?

ఆడపిల్ల - తండ్రి పోలిక ఐతే-

సంతోషించారు లెండి -

ఏమిటమ్మా - ఊరికేను - చిన్న పిల్లల్లాగా అలా పోట్లాడుకుంటారేం?

అలాగైతే టిక్కట్లు పెట్టేస్తాం.

. . . . . . . . .

బాగానే ఉంది - నాకు పనుంది అవతల - వెళ్ళతాను కాని - మీ అమ్మ చూస్తూందిలే - నాటకమేమిటో - నేను వెళతాను.

నేను వెళతాను - నాకు మటుకు -

వెళ్ళు - నేను రమ్మన్నానా?

లేదులెండి - ఎందుకు రమ్మంటారు? వెళ్ళమంటారుగాని -

ఐతే ఉండు.

ఆహా... అన్నారే... ఎలాగైతేనేం...

- నాటకం - మొదలు పెడుతున్నాం - చూసేవాళ్ళు మాట్లాడకూడదు -

... ... ...

ఓయ్‌బాబో ఏం ఆజ్ఞ పెడుతున్నావమ్మా - ఇదే నా - నాటకం?

ఇదేనేం - ఇదే ఐతే - నాన్న నువ్వే ఆడేస్తున్నారుకా - అంతాను - మమ్మల్ని మాట్లాడనియ్యందే - అంతా మీరే అప్పచెప్పేస్తూంటే?

పోనీలే - మీ నాన్నలాగానే నీకూ తోచిందా ఏమిటి? నేనుండనులే - నేనూ ఉండను - అలాగు ఉడికిపోతావేం?

నేనా - మీరా -

ఎవరూ - మాట్లాడకూడదు -

అమ్మా - మరె - పాప నాన్ననుకో - నేను నువ్వు - కథ చెప్పనా - నాన్న సాయంకాలం - ఇంటికి వస్తాడు - అమ్మ - సంతోషంగా - నవ్వుతూ ఎదురుగుండా వెళుతుంది - నాన్న కూడా నవ్వుతాడు. ఇద్దరూ కులాసాగా కబుర్లు చెప్పుకుంటారు - ఇది మొదలన్నమాట - ఇక ఆడమా?

అక్కర్లేదులే - తెలిసింది - చాలు మీ నాటకం

ఎలా వెళుతారో వెళ్ళండి - ఇదిగో తాళం వేసేశాను కదూ - నీవు ఇలా అంటావని నాకు తెలుసును -

తలుపుతీయి -

నాటకం -

తీయకపోతే - ఓ జెల్లా ఇస్తాను -

దెబ్బలు తింటూనే - నాటకం ఆడతాము.

... ... ...

ఇక తరువాత - కథ... జెప్పనులే - ఈలా ఆడుదామనుకున్నాం - భోజనాలయినాయి... అనుకుంటూ - నాన్న ... యీజీ చైరులో కూర్చుంటాడు - అదిగో... అలా... పాపా - పడుకో మోక - సగం వాలి కూర్చో:- అమ్మ - ఆకులు చీల్చి ఇస్తూ ఉంటుంది - అరే పాందాను తీసుకురావడం మరచిపోయినానే - ఇప్పుడు వెళ్ళి... అమ్మో - తలుపు తీస్తే మీరిద్దరూ బయటికి పారిపోతారు... ఉత్తుత్తినే... అనుకుందాంలే: ఇదిగో ఈలా... కూర్చుంటుంది... నవ్వుతూ - కబుర్లు చెబుతూ నాన్న కూడా ఏమో మాట్లాడుతూ - ఒక్కొక్క మడుపు తీసుకుంటూంటాడు - పాపా - నవ్వుతూ మాట్లాడూ:...

ఒక ఆకుమడుపు - అమ్మనోటికి కొంటెతనంగా అందించబోతాడు - అమ్మ - చేయిపట్టుకుని - వద్దన్నట్లు అని... చివరకు కొరుకుతుంది... నాన్న ఆ మిగిలినది ఆనక నిజంగా - నీకు ఆకులు ఇస్తానులే - ఏటీ - నములుతున్నట్లుండు... బాగా - వాళ్ళకు కనబడాలి...

ఒకళ్ళని - ఒకరు - తమాషాగా చూసుకుంటూ కూర్చుంటారు - అలా చూస్తావేం... వెక్కిరింపుగా కాదు... కళ్ళు తిప్పు పోనీ - చేతగాకపోతే...

వెన్నెల వచ్చింది కనుక - లైటు స్విచ్ వేసేస్తాడు నాన్న - ఇక ఏదో మెల్లిగా మాట్లాడుకుంటూ - నవ్వుకుంటారు... నీ మొఖంలే - నీకు ఏమి చేతకాదురా ప్పాపా... మెల్లిగా మాట్లాడవేలా ఊరికే పెదవులు కదుల్చు... ఇక చాల్లే... మెదలకుండా బయటికి రా...

- నాటకం - అయిపోయింది -

మరి తలుపు తీయరేం - మీదంతా మరీ ఆగడం - బయటికి పరుగెత్తి తాళం వేశారేం - తీయండి - తీయవే అమ్మాయి...

తీస్తారా - తీయరా... ఏమిటిది...

అమ్మా... తాళం చెవి - పోయింది.

★ ★ ★